భవితకు భరోసా

నేడు విభిన్న ప్రతిభావంతుల దినోత్సవం

- ప్రత్యేక అవసరాల పిల్లలకు ఆశాదీపం
- అండగా నిలుస్తున్న భవిత కేంద్రాలు

జన్యుపరమైన లోపాలతో మానసిక, శారీరక వైకల్యానికి గురైన చిన్నారుల తల్లిదండ్రులు పడే మానసిక క్షోభ చెప్పలేనిది.. ఇలాంటి ప్రత్యేక అవసరాలు కలిగిన చిన్నారుల కోసం సమగ్ర శిక్ష భవిత కేంద్రాలు ఏర్పాటు చేసింది. ఈ కేంద్రాలు దివ్యాంగ పిల్లలను అక్కున చేర్చుకుంటున్నాయి. ఫిజియో థెరపీ, స్పీచ్ థెరపీతో పాటు ప్రత్యేక విద్య ద్వారా వారిలో మార్పు తీసుకువచ్చి.. సాధారణ పిల్లల మాదిరిగా కేంద్రాలకు వెళ్లి చదువు కొనసాగించేలా పని చేస్తున్నాయి.


భవిత కేంద్రంలో క్యారమ్స్ ఆడుతున్న విద్యార్థులు


భవిత కేంద్రంలో భోజనాలు చేస్తున్న చిన్నారులు


క్రీడల్లో పాల్గొన్న పిల్లలకు స్పీచ్‌థెరపీ చేస్తున్న నిర్వాహకులు


చిన్నారులకు డ్రాయింగ్‌లో శిక్షణ ఇస్తున్న ఉపాధ్యాయుడు

పెదగంట్యాడ: మానసిక వైకల్యంతో బాధపడే చిన్నారుల జీవితాల్లో వెలుగులు నింపేలా భవిత కేంద్రాలు కృషి చేస్తున్నాయి. సమగ్ర శిక్ష ఆధ్వర్యంలో మండలంలో నిర్వహిస్తున్న భవిత కేంద్రంపై విభిన్న ప్రతిభావంతుల దినోత్సవాన్ని పురస్కరించుకొని కథనం..

బంగారు భవిత..

భవిత కేంద్రంలో చిన్నారులకు బంగారు భవిష్యత్తు అందించేందుకు ప్రత్యేకంగా ఉపాధ్యాయులను నియమించి విద్యా బోధన సాగిస్తున్నారు. చిన్న చిన్న లోపాలతో బాధపడుతున్న పిల్లలపై ప్రత్యేక శ్రద్ధ వహించి.. వారికి మామూలు చిన్నారుల మాదిరిగా శిక్షణ ఇస్తున్నారు .

కేంద్రంలో సేవలు ఇలా..

సహిత విద్య విభాగం సమగ్ర శిక్ష ద్వారా 3 నుంచి 18 ఏళ్ల లోపు పిల్లలకు ఇన్‌క్లూజివ్ ఎడ్యుకేషన్ రిసోర్స్ పర్సన్స్ ద్వారా 21 రకాల ప్రత్యేక సేవలందిస్తున్నారు. అవసరమైన వారి ఇళ్లకు కూడా సిబ్బంది వెళుతున్నారు. ఉపకరణాల పంపిణీ, నిష్ణాతులతో ఫిజియో థెరపీ, చిన్నపాటి శస్త్ర చికిత్సలు, కరెంట్ థెరపీ, స్పీచ్ థెరపీ, ఇంటి వద్ద విద్యా బోధన, బడి బయట పిల్లలను గుర్తించడం, దివ్యాంగుల స్థితిగతులపై అవగాహన వంటి కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు.

అలవెన్సులు

ప్రత్యేక అవసరాలు గల చిన్నారుల కోసం ప్రత్యేకంగా అలవెన్సులు మంజూరు చేస్తున్నారు. అందులో ఎస్కార్ట్ అలవెన్సు, ట్రాన్స్‌పోర్టు అలవెన్సు, హోమ్ బేస్డ్ అలవెన్సు, రీడర్ అలవెన్సు, ఆడపిల్లలకు స్టైఫండ్ ఇస్తున్నారు.

అధైర్య పడవద్దు



మానసిక, శారీరక వైకల్యంతో బాధపడుతున్న చిన్నారులను చూసి తల్లిదండ్రులు అధైర్యపడకుండా భవిత కేంద్రంలో విద్య అందిస్తున్నాం. జన్యులోపం వల్ల వచ్చే సమస్యగానే చూడాలే తప్పా ఇదేదో తప్పుగా భావించి చిన్నారుల్లో ఆత్మనూన్యతా భావాన్ని నింపొద్దు.చిన్నారుల అభిరుచులకు అనుగుణంగా శిక్షణ ఇచ్చి వారిని ప్రతిభావంతులుగా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తున్నాం. ఇక్కడి ఫలితాలు చూసి తల్లిదండ్రులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

-కె.రమణాజీ, ఎంఈవో-2, పెదగంట్యాడ

అర్థమయ్యేలా బోధన



పెదగంట్యాడ భవిత కేంద్రంలో ప్రస్తుతం 20 మంది ప్రత్యేక అవసరాల పిల్లలు ఉన్నారు. చిన్నారులకు అర్థమయ్యేలా ఆటపాటలతో విద్యాబోధన సాగిస్తున్నాం. వారిలో ప్రతిభను ప్రోత్సహిస్తున్నాం. చిన్నారుల్లో పురోగతి కనిపించడం చూసి తల్లిదండ్రులు సంతృప్తి వ్యక్తం చేస్తున్నారు.

- ఎం.సూర్యనారాయణ, ఐఈఆర్టీ భవిత కేంద్రం పెదగంట్యాడ

సేవలు బాగున్నాయి



వినికిడి లోపం, బుద్ధిమాంద్యంతో బాధపడుతున్న పిల్లలకు ఈ కేంద్రంలో మంచి సేవలందిస్తున్నారు. నా కుమార్తె షైనీ బుద్ధిమాంద్యంతో బాధపడుతోంది. ఐదేళ్ల నుంచి ఈ కేంద్రానికి పంపిస్తున్నాను. ఇక్కడ వైద్య సేవలు బాగున్నాయి. నా కుమార్తె ఆరోగ్యం బాగానే ఉంటుంది.

– జి. కవిత, వికాష్‌నగర్ పెదగంట్యాడ

పురోగతి ఉంది



నా కుమారుడు రామ్‌చరణ్ పుట్టుకతోనే నరాల బలహీనతతో బాధపడుతున్నాడు. ఎవరు ఏం చెప్పినా అర్థం చేసుకోలేని స్థితిలో ఉన్నాడు. నాలుగేళ్ల నుంచి ఈ కేంద్రానికి తీసుకువస్తున్నాను. చిన్నపాటి శస్త్ర చికిత్స చేయించారు. ఫిజియో థెరపీ, కరెంట్ థెరపీ చేస్తున్నారు.ఇప్పుడు ఏం చెప్పినా అర్థం చేసుకుంటున్నాడు. కొంచెం కొంచెం ఆరోగ్యం మెరుగుపడుతోంది. చాలా సంతోషంగా ఉంది.

- పూడి మానస, దయాల్‌నగర్, పెదగంట్యాడ.

క్లుప్తంగా

అధిక ఉత్పత్తికి ఉద్యోగులు సహకరించాలి


స్టీల్‌ప్లాంట్ నూతన వర్క్స్ సీజీఎం మొహంతిని సత్కరిస్తున్న ఉద్యోగులు

ఉక్కునగరం: స్టీల్‌ప్లాంట్‌లో అధిక ఉత్పత్తి సాధనకు ఉద్యోగులంతా సహకరించాలని స్టీల్‌ప్లాంట్ సీజీఎం (వర్క్స్) రంజన్ మొహంతి కోరారు. నూతన సీజీఎం (వర్క్స్)గా బాధ్యతలు స్వీకరించిన సందర్భంగా సోమవారం స్టీల్‌ప్లాంట్ క్యూఏటీడీ విభాగం ఉద్యోగులు ఆయనను ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా మొహంతి మాట్లాడుతూ ఇక రెండు బ్లాస్ట్‌ఫర్నేస్‌ల నుంచి రోజుకు 15 వేల టన్నుల హాట్ మెటల్, ఎస్.ఎం.ఎస్‌ల నుంచి 100 హీట్ల సాధనకు యాజమాన్యం ప్రణాళిక సిద్ధం చేసిందన్నారు. లక్ష్య సాధనకు ఉద్యోగులందరూ కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో జె. నరేష్‌కుమార్, ఎం.వెంకటేశ్వరరావు, టి.వి. చంద్రశేఖర్, ఆర్.ఎస్.వి. మల్లేశ్వరరావు, ఎస్. చంద్రశేఖర్, వర్మ పాల్గొన్నారు.

ఉక్కు జనరల్ ఆస్పత్రి విభాగాధిపతిగా డాక్టర్ సారంగి


బాధ్యతలు స్వీకరిస్తున్న డాక్టర్ సారంగి

ఉక్కునగరం: స్టీల్ ప్లాంట్ జనరల్ ఆస్పత్రి విభాగాధిపతిగా ఆస్పత్రి జీఎం (మెడికల్) డాక్టర్ జె.ఎన్. సారంగి బాధ్యతలు స్వీకరించారు. ఇప్పటి వరకు ఆ బాధ్యతలు నిర్వహించిన డాక్టర్ ఎ.పి. నవీన్‌కుమార్ పదవీ విరమణ చేశారు. దీంతో ఆ బాధ్యతలను డాక్టర్ జె.ఎన్. సారంగికు అప్పగించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆస్పత్రి అభివృద్ధికి తన వంతు కృషి చేస్తానన్నారు. ఇందుకు వైద్యులు, సిబ్బంది సహకరించాలని కోరారు. బాధ్యతలు స్వీకరించిన సారంగినిఆస్పత్రి వైద్యులు, సిబ్బంది కలిసి శుభాకాంక్షలు తెలిపారు.

నిత్యావసర సరకుల అందజేత


కుట్టు మిషన్, సరకులు అందజేస్తున్న అసోసియేషన్ ప్రతినిధులు

గాజువాక: స్థానిక స్ఫూర్తి అనాథాశ్రమానికి సోమవారం మానవ సేవే మాధవ సేవ అసోసియేషన్ ప్రతినిధులు కుట్టు మిషన్, నిత్యావసర సరకులు అందజేశారు. సంస్థ నెలవారీ కార్యక్రమంలో భాగంగా సమకూర్చిన వస్తువులను ఆశ్రమం నిర్వాహకుడు వి.రాజేష్‌కు అందజేసినట్టు అసోసియేషన్ వ్యవస్థాపకుడు ఎస్. భాను ప్రకాష్ తెలిపారు. కార్యక్రమంలో అసోసియేషన్ ప్రతినిధులు ఎస్.సీతారామకృష్ణ, వై.తిరుమూర్తి, డి.వరప్రసాద్, కె.వి.ఎన్.ఎస్.ప్రసాద్, కె.వి.వర్మ, పి.సంతోష్ కుమార్, సూరిబాబు తదితరులు పాల్గొన్నారు.

చినుకు పడితే చిత్తడే..


బురదమయంగా మారిన అక్కిరెడ్డిపాలెం జెడ్పీ హై స్కూల్ ఎదురుగా గల మైదానం

అక్కిరెడ్డిపాలెం: చిన్నపాటి వర్షం పడితే చాలు అక్కిరెడ్డిపాలెం జిల్లా పరిషత్ హైస్కూల్ ఎదురుగా గల మైదానం చిత్తడిగా మారుతోంది. మైదానం సాధారణ స్థితికి రావడానికి కనీసం 10 రోజుల సమయం పడుతుంది. అప్పటి వరకు కనీసం స్కూల్ విద్యార్థులు ఆటలు ఆడుకోవడానికి ఇబ్బంది పడుతున్నారు. పాలకులు స్పందించి మైదానాన్ని అభివృద్ధి చేయాలని విద్యార్థులు కోరుతున్నారు.

శభాష్.. చినపాలెం యూత్


చినపాలెంరోడ్డులో గుంతులను పూడ్చుతున్న చినపాలెం యూత్ అసోసియేషన్ సభ్యులు

పెదగంట్యాడ: జీవీఎంసీ 77వ వార్డు పరిధిలోని చినపాలెం వెళ్లే ప్రధాన రహదారి గజానికో గొయ్యి.. అడుగుకో గుంతతో అధ్వానంగా మారింది. రోడ్డు మొత్తం ఛిద్రం కావడంతో పాదచారులు, వాహనచోదకులు నిత్యం ప్రమాదాలకు గురవుతున్నారు. ఈ రోడ్డులోని గుంతలు పూడ్చాలని పలుమార్లు అధికారులు, ప్రజాప్రతినిధులకు విన్నవించినా ఫలితం లేకపోయింది. దీంతో చినపాలెం యూత్ సభ్యులు స్పందించారు. సొంత నిధులతో రోడ్డులోని గుంతలను పూడ్చివేశారు. రహదారి మొత్తం ప్రయాణాలకు ఇబ్బందులు లేకుండా తయారు చేశారు. దీంతో స్థానికులు హర్షం వ్యక్తం చేశారు. యూత్ సభ్యులను అభినందించారు.

రాష్ట్రస్థాయి నెట్‌బాల్ పోటీలకు కణితి విద్యార్థులు


విద్యార్థులతో పాఠశాల హెచ్‌ఎం సూర్యప్రకాశరావు, పీడీలు మన్నాజీ, నారాయణరావు

అగనంపూడి: రాష్ట్ర స్థాయి నెట్‌బాల్ పోటీలకు కణితి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు ఎంపికయ్యారు. జిల్లా నెట్‌బాల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన పోటీల్లో కణితి హైస్కూల్‌కు చెందిన 9వ తరగతి విద్యార్థులు ఎస్.నితీష్, ఈ.ఎర్రమ్మ, 8వ తరగతి విద్యార్థి జోగారావులు ఉత్తమ క్రీడా ప్రతిభ కనబర్చి రాష్ట్రస్థాయి పోటీలకు అర్హత సాధించారని పాఠశాల హెచ్‌ఎం సూర్యప్రకాశరావు, ఫిజికల్ డైరెక్టర్లు ఎం.మన్నాజీ, పి.నారాయణరావు తెలిపారు. వీరిని పాఠశాలలో సోమవారం ఉపాధ్యాయులు అభినందించారు. వీరు కర్నూలులో నిర్వహించనున్న రాష్ట్రస్థాయి టోర్నమెంట్‌లో పాల్గొననున్నారని వారు పేర్కొన్నారు.

• గుర్తుకొస్తున్నాయి



జీవీఎంసీ 68వ వార్డు అక్కిరెడ్డిపాలెం జిల్లా పరిషత్ హైస్కూల్ ప్రాంగణం సందడిగా మారింది. 1988 - 89 బ్యాచ్ విద్యార్థుల కేరింతలు..ఆటపాటలతో కళకళలాడింది. పూర్వ విద్యార్థులు 35 సంవత్సరాల తర్వాత కలుసుకోవడంతో ఆత్మీయత, అనురాగాలు వెల్లువిరిశాయి. ఒకరికొకరు యోగక్షేమాలు, ప్రస్తుత ఉద్యోగ, వ్యాపారాలు, కుటుంబ పరిస్థితులు తెలుసుకుంటూ ఆనందంగా గడిపారు. నాటి జ్ఞాపకాలను నెమరువేసుకున్నారు. కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు సంద్రాన నూకరాజు, కాకి ముత్యాలరెడ్డి, రాపర్తి వాసు, గవర వెంకటేశ్వరరావు, పల్లా లక్ష్మణరావు, మువ్వా సతీష్ తదితరులు పాల్గొన్నారు. - అక్కిరెడ్డిపాలెం

మస్తానప్ప సేవలు నిరుపమానం

మాజీ మంత్రి అమర్‌నాథ్


సంతాప సభకు హాజరైన నాయకులు, ఉద్యోగులు



మస్తానప్ప చారిటబుల్ ట్రస్ట్ లోగో ఆవిష్కరిస్తున్న మాజీ మంత్రి అమర్‌నాథ్, మాజీ ఎమ్మెల్యే నాగిరెడ్డి, నాయకులు

ఉక్కునగరం: కార్మిక నాయకుడిగా మస్తానప్ప ఎనలేని సేవలు అందించారని మాజీ మంత్రి, వైఎస్సార్‌సీపీ విశాఖ జిల్లా అధ్యక్షుడు గుడివాడ అమర్‌నాథ్ కొనియాడారు. ఉక్కునగరం అంబేడ్కర్ కళాక్షేత్రంలో సోమవారం మస్తానప్ప సంతాప సభ నిర్వహించారు. ఈ సందర్భంగా అమర్‌నాథ్ మాట్లాడుతూ మస్తానప్ప వైఎస్సార్‌సీపీ ఆవిర్భాం నుంచి పార్టీలో ఉంటూ పార్టీ బలోపేతానికి కృషి చేశారన్నారు. స్టీల్ ప్లాంట్‌లో వైఎస్సార్‌టీయూసీ నాలుగో పెద్ద కార్మిక సంఘంగా ఎదగడంలో మస్తానప్ప పాత్ర మరువలేనిదన్నారు. వారి కుటుంబ సభ్యులు మస్తానప్ప పేరిట ట్రస్టు ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. మాజీ ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి మాట్లాడుతూ మస్తానప్ప కార్మికుల్లో ఉంటూ వారి సమస్యల పరిష్కారం కోసం అహర్నిశలు కృషి చేశారన్నారు. ఆయన మృతి వైఎస్సార్‌సీపీకి తీరని లోటన్నారు. మాజీ ఎమ్మెల్యేలు కరణం ధర్మశ్రీ, చింతలపూడి వెంకట్రామయ్య, వైఎస్సార్‌టీయూసీ నగర అధ్యక్షుడు అనిల్‌కుమార్, కార్పొరేటర్ పి.వి. సురేష్, వివిధ కార్మిక సంఘాలు, అసోసియేషన్ల నాయకులు మంత్రి రాజశేఖర్, డి. ఆదినారాయణ, వై.టి. దాస్, యు. రామస్వామి, వరసాల శ్రీనివాసరావు, ఎస్. సత్యనారాయణ, శ్రీనివాసరావు, నక్క వెంకటరమణ, అన్వేష్ తదితరులు మస్తానప్ప సేవలను కొనియాడారు. ఈ సందర్భంగా వై. మస్తానప్ప చారిటబుల్ ట్రస్టు లోగోను ఆవిష్కరించారు. కార్యక్రమంలో మస్తానప్ప భార్య వై. వరలక్ష్మి, వైఎస్సార్‌టీయూసీ నాయకులు డి.వి. రమణారెడ్డి, డి. ఫుల్లారావు, పిట్టారెడ్డి, బొడ్డ గోవింద, ఎన్నేటి రమణ, దాలినాయుడు, శశిభూషణరావు పాల్గొన్నారు.

ఘనంగా పోలి పాడ్యమి పూజలు


అన్నసమారాధనను ప్రారంభిస్తున్న మాజీ ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి


వడ్లపూడిలో పూజలు చేస్తున్న నాయకులు


ఆలయంలో పూజలు చేస్తున్న భక్తులు


వాసవీ పంచాయతన ఆలయం వద్ద గంగా దేవికి నమస్కరిస్తున్న భక్తులు


తుంగ్లాంలో కోదండ రామాలయం ఎదుట దీపాలు వెలిగిస్తున్న భక్తులు

అగనంపూడి: పోలి పాడ్యమిని పురస్కరించుకొని 87వ వార్డు కణితి సంతమామిడితోట శివాలయంలో ఘనంగా పూజలు నిర్వహించారు. మహిళలు దీపారాధన చేశారు. ఆలయంలో భక్తులు క్షీరాభిషేకం, జలాభిషేకం, అభిషేకాలు జరిపించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన మాజీ ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి పాల్గొని పూజలు చేసి భారీ అన్న సమారాధనను ప్రారంభించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ గాజువాక క్లస్టర్ అధ్యక్షుడు బొడ్డ గోవింద్, నాయకులు దుగ్గపు దానప్పలు, బొడ్డ సన్యాసిరావు, ఆలయ కమిటీ ప్రతినిధులు మల్ల సూరిబాబు, సతీష్, బంటు వీర్రాజు, మల్ల గోవింద్, గల్లా సతీష్, సర్లాన ఈశ్వరరావు పాల్గొన్నారు.

వడ్లపూడి శివాలయంలో..

వడ్లపూడిలోని శివాలయంలో పోలి పాడ్యమి పూజల అనంతరం విశేష అన్న సమారాధన కార్యక్రమం చేపట్టారు. కార్యక్రమంలో 87వ వార్డు వైఎస్సార్‌సీపీ ఇన్‌చార్జ్ కోమటి శ్రీనివాసరావు, రమాదేవి, గోవింద్, వడ్లపూడి ఈశ్వరరావు, జెర్రిపోతుల ఈశ్వరరావు, ధనుంజయ్ పాల్గొన్నారు.

పెదగంట్యాడ: పోలి పాడ్యమిని పురస్కరించుకుని సోమవారం తెల్లవారుజాము నుంచి ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి. పోయిరావమ్మా పోలమ్మ అంటూ భక్తులు పోలిని స్వర్గానికి సాగనంపారు. పెద్ద సంఖ్యలో మహిళలు పాల్గొని ప్రత్యేక పూజలతో పాటు ఆలయ కమిటీలు ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన కొలనులో అరటి దొప్పల్లో దీపాలు వెలిగించి తమ భక్తిని చాటుకున్నారు.మరోవైపు ఆలయాలకు రాలేని భక్తులు ఇళ్లలోనే నీటి తొట్టెలను ఏర్పాటు చేసుకుని అందులో దీపాలు వెలిగించి వదిలారు. బాలచెరువులోని ఉమారామలింగేశ్వర ఆలయంలో ప్రత్యేక పూజలు చేసి అర్చకులకు సాలగ్రామం, స్వయంపాకం ఇచ్చారు. అలాగే హౌసింగ్ బోర్డు వాసవీ పంచాయతన ఆలయంతో పాటు పెదగంట్యాడ శివాలయాలకు భక్తులు పోటెత్తారు.

తుంగ్లాంలో..

అక్కిరెడ్డిపాలెం: పోలిపాడ్యమిని పురస్కరించుకుని వేకువ జామునే భక్తులు పలు ఆలయాల ఎదుట, చెరువుల్లో, ఇంట్లో నీటి తొట్టెలలో దీపాలు వెలిగించి పూజలు నిర్వహించారు. తుంగ్లాంలోని కోదండరామాలయంతో పాటు పలు శివాలయాల్లో శివయ్యకు పంచమృతాభిషేకం, విశేష పూజలు నిర్వహించారు.

అయోధ్యకు ప్రత్యేక రైలు నడపాలని వినతి


డీఆర్‌ఎం మనోజ్‌కుమార్‌కు వినతి పత్రం అందిస్తున్న రైల్వే యూజర్స్ కన్సల్టేటీస్ సభ్యుడు ఈశ్వర్

అగనంపూడి: విశాఖ నుంచి అయోధ్యకు ప్రత్యేక రైలు నడపాలని కోరుతూ రైల్వే జోనల్ యూజర్స్ కన్సల్టేటీస్ సభ్యుడు కె.ఈశ్వర్ సోమవారం వాల్తేరు డివిజనల్ రైల్వే మేనేజర్ మనోజ్‌కుమార్‌సాహు తోపాటు సీనియర్ డీసీఎం సందీప్‌కు వేర్వేరుగా వినతిపత్రాలు అందజేశారు. అయోధ్య రాముడి ఆలయం, వారణాసి, ప్రయాగ ప్రాంతాలకు ఈ ప్రాంతం నుంచి రైలు సౌకర్యం లేకపోవడంతో వేలాది మంది శ్రీరామ భక్తులు అసౌకర్యానికి గురవుతున్నారని పేర్కొన్నారు. వచ్చే ఏడాది జనవరి 13 నుంచి ఫిబ్రవరి 26 వరకు ప్రయాగలో కుంభ మేళాను దృష్టిలో పెట్టుకొని ప్రత్యేక రైళ్లు నడపాలని ఆయన కోరారు.

'దువ్వాడ' సమస్యలపై చర్చ

సీనియర్ డీసీఎం సందీప్ కుమార్‌తో దువ్వాడ రైల్వేస్టేషన్‌లో సమస్యలపై చర్చించామని తెలిపారు. ప్రీపెయిడ్ ఆటో సౌకర్యం, బ్యాంక్ ఏటీఎం, ప్లాట్‌ఫారాలపై టీ, కాఫీ స్టాల్స్ ఏర్పాటు చేయాలని కోరగా సీనియర్ డీసీఎం సానుకూలంగా స్పందించారని ఈశ్వర్ తెలిపారు.

ఫీజు చెల్లించాలని వేధిస్తున్నారని ఫిర్యాదు

మహారాణిపేట: ఇంటర్‌లో వచ్చిన మార్కుల ఆధారంగా 50 శాతం ఫీజు రాయితీ ఇస్తామని కళాశాలలో చేర్పించుకుని.. ఇప్పుడు పూర్తి ఫీజు చెల్లించాలని యాజమాన్యం ఒత్తిడి తెస్తుందని సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వేదికలో సామాజిక కార్యకర్త అంపోలు మురళీకృష్ణ ఫిర్యాదు చేశారు. గాజువాకలోని ఆదిత్య డిగ్రీ కాలేజీ యాజమాన్యం ఫీజు చెల్లించలేదని డిగ్రీ పరీక్షలకు హాల్ టికెట్ ఇవ్వలేదని విద్యార్థిని వి.లత వాపోయారు. ఇంటర్‌లో 980 మార్కులు రావడంతో 50 శాతం రాయితీ ఇస్తామని చెప్పి ఇప్పుడు పూర్తి ఫీజు కట్టాలని వేధిస్తున్నారని తల్లిదండ్రులు వాపోయారు.తమ కుమార్తెకు న్యాయం చేయాలని కలెక్టర్‌కు మొరపెట్టుకున్నారు.

'ఉక్కు' హామీని కూటమి నిలబెట్టుకోవాలి


రాజీవ్‌నగర్‌లో పోస్టుకార్డు ఉద్యమం నిర్వహిస్తున్న ఐద్వా నాయకులు

అగనంపూడి: విశాఖ స్టీల్‌ప్లాంట్‌ను కాపాడతామని కూటమి నాయకులు ఇచ్చిన హామీని నిలబెట్టుకోవాలని ఐద్వా జిల్లా కార్యదర్శి సత్యవతి కోరారు. విశాఖ ఉక్కు పరిరక్షణ ఉద్యమంలో భాగంగా చేపట్టిన పోస్టుకార్డు ఉద్యమాన్ని సోమవారం 86వ వార్డు రాజీవ్‌నగర్‌లోచేపట్టారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణ యోచనను విరమించుకోవాలని, సకాలంలో జీతాలు చెల్లించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో జిల్లా నాయకులు కె.వేణు, మాజీ కార్పొరేటర్ కె.విమల, స్టీల్‌జోన్ ఐద్వా నాయకులు కె.వరలక్ష్మి, యు.సుభాషిని, ప్రభ, వి.సుమలత, పద్మావతి, శాంతి తదితరులు పాల్గొన్నారు.